క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు
హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 21న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కమ్మరి వాడ, బొక్కలగడ్డ, ఈద్గా ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

నేడు కేయూలో జాతీయ సదస్సు
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కేంద్ర గ్రంథాలయం, లైబ్రరీ సైన్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న పరిపాలన భవనంలోని సెనెట్ హాల్లో వన్ నేషన్ వన్ సబ్స్క్రిప్షన్ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయం మెంబర్ ఇన్చార్జ్ ఆచార్య జీజే శ్రీలత, లైబ్రరీ సైన్స్విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణి ఒక ప్రకటనలో తెలిపారు.

పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో..
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మార్చి 21, 22వ తేదీల్లో భారతీయ సమాజంలో సంకీర్ణ రాజకీయాలు అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ గురువారం తెలిపారు. ఈమేరకు హైదరాబాద్లో ప్రొఫెసర్ హరగోపాల్ను గురువారం కలిసి జాతీయ సదస్సు ఆహ్వాన బ్రోచర్ను అందజేశారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వాడపెల్లి నాగరాజు, పరిశోధకులు అంకెళ్ల శంకర్, కలిపికొండ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

25న శివపార్వతుల కల్యాణం
వరంగల్: వరంగల్ ఎల్బీనగర్లోని హిందూ ముక్తిస్థల్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన శ్రీలక్ష్మీ – నారాయణ, శివ – పార్వతుల వటవృక్ష కల్యాణం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు బూర రాంచందర్ తెలిపారు. ఈమేరకు కల్యాణ వాల్పోస్టర్లను ముక్తిస్థల్ వద్ద గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు, సుధాకర్, ఆదినారాయణ, భాస్కర్, రమేష్, అశోక్కుమార్, ఆకెన వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య, ప్రభాకర్, ఎల్లయ్య, బాబూరావు, మధు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిట్ మాజీ ప్రొఫెసర్పై ఫిర్యాదు
కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ మాజీ ప్రొఫెసర్, ప్రస్తుత కాకినాడ జేఎన్టీయూ వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్పై ఆన్లైన్లో కాజీపేట పోలీస్స్టేషన్కు ఫిర్యాదు చేసినట్లు నిట్ అల్యూమ్ని మాజీ అధ్యక్షుడు ఆలపాటి ప్రసాద్ గురువారం తెలిపారు. 2022 – 2024 అల్యూమ్ని ఎన్నికల్లో ఇన్చార్జ్ రిజిస్ట్రార్గా వ్యవహరించిన సీఎస్ఆర్కే ప్రసాద్.. అవకతవకలకు పాల్పడ్డారని, చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

కుంభమేళా మృతులకు నివాళి
హన్మకొండ చౌరస్తా: ఇటీవల కుంభమేళాలో జరిగిన ఘటనలో మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు జమాతే ఇస్లామీ హింద్ సంస్థ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.అబ్దుల్హస్సన్ ఓ ప్రకటనలో తెలిపారు. కుంభమేళాలో కొన్ని తప్పిదాల వల్ల పలువురు మృతిచెందడం బాధాకరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆయన ప్రకటనలో కోరారు.

అంగడి భూమిని పరిరక్షించాలి
హసన్పర్తి: ఎల్లాపురంలోని అంగడి భూమిని పరిరక్షించాలని స్థానికులు కోరారు. ఈమేరకు అంగడి భూమి వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ భూమిని దానం చేశాక.. పట్టాదారులు మళ్లీ విక్రయించారని విమర్శించారు.

పరీక్షలంటే భయం వీడాలి
ఖిలా వరంగల్: పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయం వీడి ఆత్మవిశ్వాసంతో రాయాలని సైకాలజిస్ట్ డాక్టర్ బరుపాటి గోపి సూచించారు. వరంగల్ శివనగర్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర స్వామి అధ్యక్షతన పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు గురువారం మోటివేషనల్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష పత్రం పూర్తిగా చదివిన తర్వాత తెలిసిన ప్రశ్నలకు ముందుగా జవాబులు రాయాలని అన్నారు. ఉపాధ్యాయులు తిరుపతి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, దేవరాజు, అంజయ్య, నరేందర్ పాల్గొన్నారు.

కొనుగోలు పరిమితులు పెంచాలి
వరంగల్: కొలుగోలు విషయంలో 6 క్వింటాల పరిమితిని తెలంగాణ ప్రభుత్వం విధించడం వల్ల ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల కంది దిగుబడి వచ్చిన రైతులు అనేక ఇబ్బందులతో పాటు నష్టపోతున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ చందర్రావు, చేర్యాల పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఉడుముల బాల్రెడ్డి తెలిపారు. ఈక్రమంలో పరిమితులను పెంచాలని కోరారు. ఈమేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు.

సినీహీరో గోపీచంద్ పూజలు
హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని సినీహీరో గోపీచంద్ గురువారం సందర్శించారు. ఈమేరకు అమ్మవారిని గోపీచంద్ దర్శించుకుని పూజలు చేశారు. టీఎన్జీఓ భాగ్యనగర్ హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ.. గౌడ్ సొసైటీ పాలకవర్గం తోపాటు కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

అందరూ ఒక్కటయ్యారు!

- అడ్తిదారులు, గుమస్తాలు, కొంతమంది ఉద్యోగుల సిండికేట్
- ఏనుమాముల మార్కెట్లో మిర్చి రేటు తగ్గిస్తున్నా పట్టించుకోని అధికారులు
- తక్కువ ధరకు సరుకు విక్రయించి నష్టపోతున్న రైతులు


వరంగల్ వ్యవసాయ మార్కెట్లో అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్లో అడ్తిదారులు, కొనుగోలుదారుల గుమస్తాలు, కొంతమంది ఉద్యోగులు ఒక్కటై మిర్చి ధరలు తగ్గిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది తెగుళ్లతో మిర్చి దిగుబడి తగ్గినట్లు వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. ఉన్న కొద్ది పంటను అమ్ముకునేందుకు వరంగల్ మార్కెట్కు తీసుకువస్తే అందరు ఒక్కటై ధరలు తగ్గిస్తున్నారని, తెచ్చిన సరుకులు తిరిగి తీసుకుపోలేక, కోల్డ్స్టోరేజీల్లో పెట్టేస్థాయి లేకపోవడంతో రైతులు కొనుగోలుదారులు చెప్పిన ధరలేక విక్రయిస్తూ ఇంటి ముఖం పడుతున్నారు. కోల్డ్స్టోరేజీల్లో పెట్టుకుంటే రూ.2 లక్షల వరకు 6 నెలలపాటు వడ్డీ లేని రుణం వస్తుంది కదా అని ప్రశ్నిస్తే.. ఆ పథకంలో డబ్బులు మంజూరయ్యేవరకూ అప్పులిచ్చిన వారు ఆగే పరిస్థితి లేకపోవడంతో తెచ్చిన మిర్చి పంటను విక్రయిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. మార్కెట్లో ఈ–నామ్ అమలు చేయడం లేదు. గురువారం సుమారు 35 వేల బస్తాల మిర్చి వచ్చినట్లు మార్కెట్ ఉద్యోగులు తెలిపారు.

ధరల పతనం వెనుక దళారుల హస్తం!
మిర్చి ధరలు రోజురోజు పడిపోతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ధరల నిర్ణయంలో దళారుల దందా మూడు పూలు.. ఆరు కాయలుగా సాగుతోంది. సీజన్లో మార్కెట్కు వచ్చే సరుకు పెరుగుతున్నాకొద్ది ధరలు పడిపోవడం వెనుక దళారుల హస్తం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీజన్ ప్రారంభంలో ఉన్న మిర్చి ధరలు క్రమేణా తగ్గడంతో ఈ అనుమానాలకు బలం చేకూరుతోంది. 2024 జనవరిలో గరిష్ట ధర క్వింటాలుకు రూ.24,000 ఉండగా.. కనిష్టంగా రూ.14,000కు తగ్గలేదు. ఈ జనవరిలో గరిష్టంగా రూ.16,000, కనిష్టంగా రూ.11,000 ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితులను గమనించిన రైతు సంఘాల ప్రతినిధులు మార్క్ఫెడ్తో కొనుగోలు చేయించాలని, మిర్చి రైతులకు పంట నష్టం కింద కేంద్రం మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

నాణ్యతపై నజర్ పెట్టని అధికారులు
అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిస్థితి. మార్కెట్ పరిధిలో సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి, ఇద్దరు గ్రేడ్–2 కార్యదర్శులతో కలిపి మొత్తం 110 మంది అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వర్తించాల్సి ఉంది. ప్రస్తుతం ఇద్దరు గ్రేడ్–2 కార్యదర్శులతో కలిసి 75 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో మార్కెట్లో సరకుల విక్రయాలపై పూర్తిగా అధికారుల నజర్ లేకుండా పోయింది. ఉన్న వారికే అదనంగా బాధ్యతలు అప్పగించడంతో రైతులు తెచ్చిన సరుకుల ధరలు ఎలా నిర్ణయిస్తున్నారన్న విషయాలు పట్టించుకోని పరిస్థితులు ఉన్నాయి. సరుకులో తేమ ఏమేరకు ఉందన్న విషయాలను కొనుగోలుదారుడికి చెప్పేవారు లేకపోవడంతో దళారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ఏడాది వచ్చిన మిర్చి బస్తాలు ఈ ఏడాది వచ్చిన బస్తాలను పరిశీలిస్తే పెద్ద మొత్తంలో జీరో దందా సాగుతోందని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్లో మిర్చి ధరలు పెంచాలని రైతులు కోరుతున్నారు.

నాలుగేళ్లలో మార్కెట్కు వచ్చిన మిర్చి క్వింటాళ్లలో..

నెల	2020–21	2021–22	2022–23	2023–24	2024–25
డిసెంబర్	8,604	40,193	7,704	22,422	37,826
జనవరి	20,785	63,732	53,025	1,24,163	91,341
ఫిబ్రవరి	1,64,831	1,35,166	2,49,267	2,68,769	85,042

రూ.కోటి విలువగల స్థలానికి స్కెచ్


గాంధీనగర్లో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలం

వరంగల్: నగరానికి చెందిన ఓ ప్రధాన పార్టీ నాయకుడు తూర్పు నియోజకవర్గ ముఖ్య నేత అండదండలతో రూ.కోటి విలువైన స్థలాన్ని కాజేయడానికి స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. కాశిబుగ్గ 19వ డివిజన్ గాంధీనగర్లోని సర్వేనంబర్ 107లోని ప్రభుత్వ భూమిని కొన్ని నెలల క్రితం ఆయన ఆక్రమించుకున్నట్లు తెలిసింది. కబ్జా చేసిన నాయకుడు ఇటీవల చదును చేసి ప్లాట్లుగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు బీఆర్ఎస్కు చెందిన భాషిపాక రవికుమార్ ఇటీవల నగర కమిషనర్కు ఫిర్యాదు చేశారు. ఈఫిర్యాదుపై స్పందించిన కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు కబ్జా చేసినట్లు ఆరోపిస్తున్న స్థలం వద్దకు గురువారం వచ్చి పరిశీలించారు. ఈస్థలం గీసుకొండ పరిధిలోకి వస్తుందని అక్కడి తహసీల్దార్కు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు కేటాయించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

బీరన్న దేవాలయ భూమి ఆక్రమణ

వరంగల్: వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లిలోని ప్రధాన రహదారిపై ఉన్న బీరన్న దేవాలయానికి సంబంధించిన భూమిని ఆక్రమించుకుని కొమ్ము సురేందర్, మహేందర్ అనే వ్యక్తులు ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్యశారదకు కురుమ సంక్షేమ సేవా సంఘం నాయకులు గురువారం ఫిర్యాదు చేశారు. ఇళ్లు నిర్మించుకుంటుంటే అధికారులతో నోటీసులు ఇప్పిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సేవా సంఘం నాయకుల బుర్రి చేరాలు, దయ్యాల వేణుకుమార్, నర్సయ్య, మహేందర్ పాల్గొన్నారు.


కలెక్టర్కు ఫిర్యాదు చేస్తున్న సంఘం నాయకులు

తడి, పొడిచెత్తను వేరుచేసి అందించాలి


చెత్తపై అవగాహన కల్పిస్తున్న రాజారెడ్డి

హన్మకొండ అర్బన్: తడి, పొడిచెత్తను ప్రజలు వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని బల్దియా సీహెచ్ఓ రాజారెడ్డి సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్లో భాగంగా నగరంలోని ప్రకాశ్రెడ్డిపేటలోని న్యూ మిలినం బ్యాంకు కాలనీలో తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకరమైన చెత్తపై గురువారం అవగాహన కల్పించారు. అనంతరం, తడి చెత్త, పొడి చెత్త నిలవ్వకు వేర్వేరు డబ్బాలను అందించారు. కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షన్ అవగాహన అధికారి సంపత్రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ సీహెచ్.వెంకన్న, మున్సిపల్ జవాన్లు వై.మూర్తిరాజ్, ఎ.సుధాకర్రెడ్డి, జి.రవి, కాలనీవాసులు పాల్గొన్నారు.

డబ్బుల కోసం డప్పుల మోత

- అక్షర చిట్స్ కార్యాలయం ఎదుట డప్పులతో బాధితుల వినూత్న నిరసన

కాజీపేట అర్బన్: హనుమకొండ నక్కలగుట్టలోని అక్షర చిట్ఫండ్స్ కార్యాలయం ఎదుట అక్షర టౌన్షిప్, అక్షర చిట్స్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో బాధితులు డప్పులు కొడుతూ గురువారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అక్షర చిట్స్ కార్యాలయం ఎదుట ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సుమారు 50 మంది బాధితులు ఈనెల 15వ తేదీ నుంచి నిరసన తెలుపుతూ గురువారం డప్పుల మోతతో అక్షర చిట్స్ యజమాని పేరాల శ్రీనివాసరావు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఘటన స్థలానికి సుబేదారి పోలీసులు చేరుకుని ఆందోళనను విరమింపజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్కు చెందిన రమాదేవి మాట్లాడుతూ తన భర్త ఎల్ఐసీ డబ్బులు రూ.30లక్షలను రెండున్నర ఏళ్ల క్రితం ఎఫ్డీ చేశానని, ఇప్పుడు తన కూతురు వివాహం పెట్టుకున్నానని, ఈక్రమంలో తన డబ్బులు తనకు ఇప్పించాలని వేడుకున్నారు.


నిరసన తెలుపుతున్న బాధితులు

‘బహుజన్’ రాజ్యాధికారమే లక్ష్యం


పార్టీ ఆవిర్భావ సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

- రాష్ట్ర కన్వీనర్ జన్ను సాంబయ్య

హన్మకొండ: బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా, మహనీయుల ఆశయాల పునాదులపై బహుజన్ రాజ్యాధికార పార్టీని స్థాపిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ జన్ను సాంబయ్య తెలిపారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్టీ ఆవిర్భావ సభ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్లోని సుందరయ్య భవన్లో మార్చి 12న బహుజన్ రాజ్యాధికార పార్టీ ఆవిర్భావ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నూతన రాజకీయ పార్టీ అవసరమని భావించి, బహుజన వర్గాల ప్రజలకు సాంఘిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడం, బహుజన వర్గాల బానిస సంకెళ్లను తెంచేందుకు ఈ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది మైదం జయపాల్, పార్టీ రాష్ట్ర కోకన్వీనర్ బుర్ర సాగర్, నాయకులు అంకేశ్వర రమేష్, శ్రీరాముల పైడి, నక్క భిక్షపతి, బుర్ర కుమార్స్వామి, పీస రజిత, తరాల సమ్మక్క, తనుగుల రామచందర్, బాణాల మరియ, ఎండి.సహిదా, రమేష్, బాణాల మల్లిక పాల్గొన్నారు.

పుస్తకాల అందజేత



విద్యారణ్యపురి: హనుమకొండలోని న్యూశాయంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యావికాస ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభ్యసన సామర్థ్యాల పుస్తకాలను గురువారం అందజేశారు. కార్మిక శాఖ రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ కూరాకుల భారతి, విద్యావికాస ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్రెడ్డి, జూపాక వేణు, కోడెం సురేష్బాబు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్ల పంపిణీ



ఖిలా వరంగల్: మధ్యకోట ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏపీజే అబ్దుల్కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయుడు కె.శైలేంద్రకుమార్ అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులకు గురువారం మోడల్ టెస్ట్ పేపర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి దేవునూరి ఆనంద్, ఉపాధ్యాయులు వెంకటరమణ, కిరణ్కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఓపెన్ బీఎడ్’ గడువు పొడిగింపు
విద్యారణ్యపురి: హైదరాబాద్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ బీఎడ్ (ఓడియల్) అడ్మిషన్ ఫీజు చెల్లింపు గడువును ఈనెల 22 వరకు పొడిగించినట్లు ఆ వర్సిటీ విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. బీఎడ్ ఓడియల్ ప్రవేశ పరీక్ష–24 మొదటి దశలో కౌన్సెలింగ్లో సీటు పొందిన అభ్యర్థులు ఈనెల 22 వరకు ఫీజు చెల్లించాలని కోరారు. పూర్తి వివరాలకు 040–23680333/444/544 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. లేదా సంబంధిత వెబ్సైట్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

గూడ్స్ ట్రైన్ మేనేజర్లకు పదోన్నతులు
కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ కేంద్రంగా విధులు నిర్వహిస్తున్న 40 మంది గూడ్స్ ట్రైన్ మేనేజర్లు (గార్డులు) సీనియర్ గూడ్స్ ట్రైన్ మేనేజర్లుగా పదోన్నతులు పొందినట్లు రైల్వే అధికారులు తెలిపారు. పదోన్నతులు పొందిన వారిలో కొందరిని బెల్లంపల్లి, రామగుండం, డోర్నకల్ రైల్వేస్టేషన్లకు బదిలీపై పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వాహనాల వేలానికి స్పందన


వాహనాల వేలం నిర్వహిస్తున్న అధికారులు

కాజీపేట అర్బన్: హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన పలు వాహనాలకు గురువారం నిర్వహించిన వేలంపాటలో స్పందన వచ్చిందని హనుమకొండ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జి.దుర్గాభవాని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు వాహనాలకు రూ.63 వేలకు వేలంపాట నిర్ణయించగా, వాహనాలను కొనుగోలు చేసేందుకు పలువురు పోటీపడి రూ.1.54 లక్షలకు దక్కించుకున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగింత

కాజీపేట: కాజీపేట పట్టణంలోని పిమ్మానియేల్ చర్చిలో గురువారం తెల్లవారుజామున దొంగతనం చేయడానికి యత్నించిన ఓ వ్యక్తిని స్థానికుల సహాయంతో నైట్ వాచ్మెన్ కృష్ణ పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం విలువైన వస్తువులను అపహరించి అమ్ముకోవాలనే తలంపుతో ఓ వ్యక్తి చర్చిలోకి ప్రవేశించడంతో కుక్క అరవడం మొదలు పెట్టింది. ఎవరో చర్చి పరిసర ప్రాంతాల్లోకి వచ్చి ఉంటారని గుర్తించిన నైట్ వాచ్మెన్.. చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేశాడు. ఈ క్రమంలో దొంగను పట్టుకుని బుద్ధి చెప్పి పోలీసులకు అప్పగించారు.


దొంగకు దేహశుద్ధి చేస్తున్న చర్చి నిర్వాహకులు

క్రీడాపోటీల్లో ‘ఆర్ట్స్’ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: హనుమకొండ నెహ్రూ యువ కేంద్రం (ఎన్వైకే) ఆధ్వర్యంలో ఈనెల 17, 18వ తేదీల్లో జిల్లాస్థాయి క్రీడా పోటీలు యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు కబడ్డీ, బాడ్మింటన్, 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం సాధించారు. ఈ మేరకు వారిని కళాశాలలో ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు గురువారం అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్, డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

17.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

హసన్పర్తి: హసన్పర్తి మండలం వంగపహాడ్లో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 17.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. వంగపహాడ్లోని ముల్కలపల్లి రాజు, తెట్టె రవి ఇళ్లల్లో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయన్న సమాచారం మేరకు టాస్క్ఫోర్స్, స్థానిక పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.43.750 విలువైన బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ వివరించారు. ఇలాంటి అక్రమ దందాకు పాల్పడితే చట్టరీత్యా చర్య తీసకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో టాస్క్ఫోర్స్ ఇన్స్పెక్టర్ రంజిత్, ఎస్సై దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

పార్ట్టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

- పార్ట్టైం అధ్యాపకుల సంఘం కేయూ అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో, యూనివర్సిటీ కళాశాలల్లో పనిచేస్తున్న పార్ట్టైం అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని పార్ట్టైం అధ్యాపకుల సంఘం కేయూ అధ్యక్షుడు డాక్టర్ యనమల రాంబాబు డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం నిర్వహించిన పార్ట్టైం అధ్యాపకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫుల్ వర్క్లోడ్తో పనిచేస్తున్న పార్ట్టైం అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా నియమించాలని సూచించారు. పీరియడ్కు రూ.వేయికి పెంచాలని, పరిపాలన పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో పార్ట్టైం అధ్యాపకుల సంఘం కార్యదర్శి డాక్టర్ నరేంద్రనాయక్ బాధ్యులు తిరుణహరి శేషు, బక్కి శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రాజన్న, నవీన్, ప్రశాంత్, సరిత, రాజేందర్, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

పార్టీలో యూత్ కాంగ్రెస్దే కీలక పాత్ర



సర్టిఫికెట్ అందుకుంటున్న పరమేశ్

వరంగల్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో యూత్ కాంగ్రెస్ విభాగానిదే కీలకపాత్ర అని యువ అగ్రనేతలు దిశానిర్దేశం చేసినట్లు వరంగల్ రూరల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేశ్ పటేల్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్రెడ్డి నేతృత్వంలో ఇటీవల ఎన్నుకున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గాల అధ్యక్షులకు ఈనెల 16నుంచి 18వ తేదీ వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్ మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని ఒక రిసార్ట్లో జరిగిన శిక్షణ తరగతులకు సోనియమ్మ కుటీరం యువక్రాంతి బునియాది హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇన్చార్జ్ సురభీ దివేది, జాతీయ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి సైద్ ఖాలీద్ అహ్మద్, తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి చేతుల మీదుగా శిక్షణ తరగతుల సర్టిఫికెట్, తీసుకున్నట్లు వివరించారు.

సంక్షిప్తంగా

గంజాయి స్వాధీనం
వరంగల్: వరంగల్ బస్టాండ్ సమీపంలో గురువారం రితిక్ గంజాయి సేవిస్తూ పోలీసులకు పట్టుపడినట్లు ఇంతేజార్గంజ్ ఇన్స్పెక్టర్ షుకుర్ ఒక ప్రకటనలో తెలిపారు. అతని వద్ద నుంచి సుమారు 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య
వరంగల్: ఏనుమాముల సాయి గణేష్కాలనీలో మనస్తాపంతో కుసుమ దేవరాజ్(24) ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందినట్లు ఏనుమాముల పోలీసు ఇన్స్పెక్టర్ ఎ.రాఘవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పనిమానేసి ఇంటి వద్దనే ఉంటూ మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెంది గురువారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడని, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు రాఘవేందర్ వివరించారు.

నిట్లో విద్యార్థుల సందడి
విద్యారణ్యపురి: జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులు గురువారం నిట్లో సందడి చేశారు. క్యాంపస్లోని ల్యాబ్స్, లైబ్రరీని, ఆటస్థలాలను ఆసక్తిగా గమనించారు. ప్రొఫెసర్లతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా విద్యార్థులు వరంగల్ రీజినల్ సైన్స్సెంటర్ను, జువాలాజికల్ పార్కును, వేయి స్తంభాల గుడిని కూడా సందర్శించారు. ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేశ్, విద్యార్థులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లబెల్లి ఎంఈఓగా వసంతను కొనసాగించాలి
వరంగల్: నల్లబెల్లి ఇన్చార్జ్ ఎంఈఓగా వసంతను కొనసాగించాలని ఎమ్మార్పీఎస్, ఎల్హెచ్పీఎస్, ఎరుకుల సంఘం, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం వరంగల్ కలెక్టర్ సత్యశారదను కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు కొమ్ముల బాబు, జైసింగ్ రాథోడ్, మంద కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం ఇన్చార్జ్ అధిపతిగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మామిడి లింగయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, అధ్యాపకులు కర్రె సదాశివ్, కరుణాకర్, ఫిరోజ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే రచనలు రచించాలి
హసన్పర్తి: సమాజానికి ఉపయోగపడే రచనలు రచించాలని రచయిత్రి, వెంకట్రెడ్డి ఆర్ట్స్ ఫౌండేషన్ సాహితీ సంస్థ వ్యవస్థాపకురాలు అరుణారెడ్డి అన్నారు. వెంకట్రెడ్డి స్మారకార్థం హసన్పర్తిలోని తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయంలో గురువారం కవిత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు నగదు బహుమతితో పాటు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అశోక్రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సంబురాలు
హసన్పర్తి: ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్త ఎంపికను హర్షిస్తూ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసి, బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చకిలం రాజేశ్వర్, ఆర్యవైశ్య సంఘం హసన్పర్తి మండల అధ్యక్షుడు భీష్మనాథం, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు గొరిశెట్టి కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి నాగమళ్ల సుధీర్, నాయకులు నటరాజ్, శ్యాంసుందర్, మాధవ శంకర్, పురవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక
హన్మకొండ: హనుమకొండ వికాస్నగర్లో గురువారం జరిగిన కార్యక్రమంలో అమ్మ భద్రకాళి సొసైటీ అధ్యక్షురాలు బోగోజు స్వరూపరాణితో పాటు పలువురు మహిళలు బీజేపీలో చేరారు. ఈమేరకు వారికి పార్టీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మధుచంద్ర యాదవ్, మల్లికార్జున్రావు, కనకయ్య యాదవ్, దినేష్, ప్రశాంత్, అశోక్, రామచందర్, రాజ్కుమార్, వెంకటరమణ, నవజీవన్, భాగ్యలక్ష్మి, బొంగు కనకలక్ష్మి పాల్గొన్నారు.

పద్మశ్రీ మంద కృష్ణమాదిగకు సన్మానం
కాజీపేట రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగను కాజీపేటకు చెందిన పలువురు నాయకులు గురువారం సన్మానించారు. పద్మశ్రీ పొందినందుకు హైదరాబాద్లోని సెంట్రల్ కోర్టు హోటల్లో మంద కృష్ణమాదిగను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.